


# సాలూరు సత్తెమ్మ

రచయిత: "శ్రీ మాలిన్"

"ఏమేవ్! ఇంకా సత్తెమ్మ రాలేదూ?" అంటూ అడిగాడు నీలకంఠం.

"సత్తెమ్మ తొందర మీ కెందుకండీ? అదే యెప్పుడో వచ్చి తోముకుంటుంది అంట్లన్నీని. మీ పనేదో చూసుకోండురు. వంటింటి గొడవ కూడా మీకే కావాలి!" అంటూ సమాధాన మిచ్చింది సుందరమ్మ.

అంతలో పనిమనిషి సత్తెమ్మ కూడా వచ్చింది. భగవంతుడా విగ్రహాన్ని సృష్టించటాని కెంత కష్టపడ్డాడో! ఎలా వుండవలసిన అవయవాలు అలా అమర్చేడు. అందులోకి నడివయసు. కన్నుపడ్డాదంటే చెదిరిందన్న మాటే. సాలూరువీథుల్లోంచి సత్తెమ్మ నడుస్తుంటే చుట్టుప్రక్కలున్న కళ్లన్నీ సత్తెమ్మ మీదే పడుతుంటాయి. రకరకాల కేకలు వినిపిస్తుంటాయి. సత్తెమ్మ అందం మగవాళ్లో కళ్ళకు బంధం అంటే నమ్మండి. అందుచేత ఊళ్ళోవున్న పనిమనుషులందరికంటే సత్తెమ్మకు డిమాండు లావు. పెళ్ళికాని యువకులదగ్గఱనుండి పెళ్ళాంపోయిన మధ్యవయస్కులవరకూ అందరూ సత్తెమ్మనే పనిలో పెడదామని ఉబలాటపడుతుంటారు. పాపం సత్తెమ్మ ఎంతకని సాగుతుంది. అందుచేత సత్తెమ్మచేత అంగీకరింపబడిన దరఖాస్తులు కంటే నిరాకరింపబడిన దరఖాస్తుల సంఖ్య అధికం. ఈమధ్య పై ఊళ్లనుంచివచ్చి లాడ్జీలలో వుంటున్న విద్యార్థులుకూడా సత్తెమ్మ చేతే కేరియరు తెప్పించుకుందామని ప్రయత్నిస్తున్నారు.

అటువంటి సత్తెమ్మని నీలకంఠం అతి ప్రయాశమీద పనిమనిషిగా కుదిర్చేడు. సత్తెమ్మ గుమ్మంలో కాలుపెట్టేసరికి నీలకంఠం గబాలుమని కుర్చీలోనుంచి అప్రయత్నంగా లేచిపోయాడు. ప్రక్కనున్న సుందరమ్మను చూచి దిగాలుగా మళ్ళా చతికిలబడ్డాడు. "ఆలస్యంగావచ్చిన సత్తెమ్మపై కేకలు వేయటానికి కామోసు అయ్యగారు అలా లేచిపోయారు" అనుకుంది పాపం సుందరమ్మ. అవును మరి! మగవాళ్ళ మనస్తత్వం ఆమెకేం తెలుసు. "మీకెందు కాశ్రమ నే కోప్పడతాలెండి" అంటూ సుందరమ్మ సత్తెమ్మకు యెదురుగావెళ్లి...."ఏమే సత్తెమ్మ! మరోగంట పోయాక రాలేకపోయావా! అంట్లన్నీ అలా పడుంటే ఇంకా వంటెప్పుడు తగలెయ్యమంటావే? నీకు రోజురోజూ గర్వం లావై పోతోంది" అంటూ కేకలువేసింది.

పాపం! నీలకంఠం గుండెల్లో రాయిపడిపోయింది. సత్తెమ్మకు కోపంవచ్చి పనిమానేస్తుందేమోనని బెంగ పకప్రక్క పెనుగులాడుతోంది.

"ఏంటండమ్మగోరు! అలా కేకలు పెట్టేస్తున్నారు? నన్నేం కొనిపడేసుకున్నారేంటండి? ఇలాంటి యిళ్లు యింకా నచ్చానూరుండాయి నాకు. ఆలకు మాత్రం తొందరుంటదనుకున్నారా?" అంది సత్తెమ్మ మొగం సీగలిస్తూ!

"అంత ఆశందుకే నీకు? చేతనైన్ని యిళ్లు చేసుకోకూడదూ?" అంది సుందరమ్మ.

"పాపం! అదే చేస్తుందిలేవే! ఇపుడు వంటకేం తొందరొచ్చింది. కాకపోతే మరో అరగంట వంట ఆలస్యం అవుతుంది. అంతేనా? మరేం కొంప మునిగిపోయిందా? రేపట్నుంచి వేగంగా వస్తుందిలే" అన్నాడు నీలకంఠుడు పెద్దతగుమనిషిలా.

"బావుందండి! 'సత్తెమ్మ—సత్తెమ్మ' అని యింతసేపు కేకలుపెట్టారు, అది ఆలస్యంగా వస్తే కొంప మునిగిపోయిందేంటని ఇపుడంటున్నారు" అంది సుందరం ఇటువేపునున్న ముఖం అటు యిసుర్తూ.

"అయ్యగోరి మొగంచూసి మీయింట్లో పని చేత్తున్నా కాని! మీరు చెపితేమాత్రం చేత్తానేటమ్మగోరూ?" అంది సత్తెమ్మ సమయం చూసుకొని.

ఆమాటలు వినగానే సుందరమ్మ గుండెల్లో కవ్వం తిరిగినట్లనిపించింది. "నీయిష్టమొచ్చినట్టు అగోరించు" అనేసి చరచరా యింట్లోకి వెళ్ళిపోయింది. సత్తెమ్మ నీలకంఠం వేపు ఒక్కనవ్వువిసరేసి పెరట్లోకి పోయింది. ఆ నవ్వుతో నీలకంఠం కుర్చీలో కొయ్యబారిపోయాడు. ఏబహుమతి యిద్దామన్నా యింట్లో సుందరి అడ్డుగావుంది.

ఒకనాడు సుందరమ్మ నాన్నకు సీరియస్‌గా వుందని టెలిగ్రాం వచ్చింది. టెలిగ్రా మందుకొన్న నీలకంఠం అంబర మందుకొన్నంత సంబరపడ్డాడు. వేసిన పంచ మాసప్రణాళిక ఫలించిందనుకొన్నాడు.

"సుందరం! మీ నాన్నకు సీరియస్‌గా వుందంటే, రమ్మని టెలిగ్రామిచ్చారు" అంటూ కేకవేశాడు నీలకంఠం.

"మా నాన్నకు ప్రమాదంగావుంటే విచారించవలసినదానికి సంతోషపడతా రెందుకండి" అంది సుందరమ్మ కళ్ళు తుడుచుకొంటూ. ఆ మాటకు సమాధాన మివ్వటానికి నీలకంఠం తికమకపడుతూ "అది కాదే...." అంటూ అర్థోక్తిలో ఆగిపోయి మొఖందించుకొని వీధిలోనికి వెళ్ళిపోయాడు.

సాయంకాలంబండికి సుందరమ్మ ప్రయాణము చేయవలసిన సన్నాహాలన్నీ నీలకంఠం చకచకా సాగించేశాడు.

"మీరుకూడా రాకూడదండీ!" అంది మాయ తెలియని ఆ మహా సాధ్వి.

"నాకు కోర్టుపని, పొలంపని, ఇంకా చాలా వ్యవహారాలున్నాయి నీ వెళ్లిరా" అన్నాడు.

సుందరమ్మ వెళ్లిపోయింది. నీలకంఠం కుర్చీలో కూచొని చేయబోయే కార్యక్రమం గురించి దీర్ఘాలోచనలో మునిగి పోయాడు. గాలిలో మేడలు కట్టేసుకుంటున్నాడు. 'దాని శిఖా గొయ్యి సత్తెమ్మకళ్లలో ఎంత ఆకర్షణుంది' అనుకొంటూ తనలో తానే ముసి ముసి నవ్వేసికొంటున్నాడు. ఇంతలో సత్తెమ్మ గాజులు గళ్ళుమనిపిస్తు ప్రవేశించింది.

"అమ్మగోరేరండి బాబూ?" అని అడిగింది.

"అమ్మగా రూరికెళ్లేరు గాని! నీవు ఆ పెరట్లోవున్న అంట్లు తోమేసి వెళ్ళిపో, మళ్లా 7 గంట లయిన తరువాత హొటల్‌నుంచి భోజనం తీసుకు రావటానికి ఒక్కసారిరా" అంటూ ఆజ్ఞాపించాడా మహానుభావుడు.

సత్తి సరి అని ఊకొట్టి పని చక్కబెట్టుకొనిపోయింది.

ఏడు గంటలయే సరికల్లా సత్తెమ్మ గబ గబా రైలింజనులాగ వచ్చేసింది. కేరియరు పట్టుకొని హొటల్‌కు వెళ్ళింది. హొటల్ నుంచి ఎంతట తిరిగివస్తుందా అని నీలకంఠం గుమ్మంలో పచారుచేస్తున్నాడు. అంతలో సత్తి కేరియర్ తెచ్చి వంటింట్లో పెట్టింది.

"సత్తీ! ఆపక్క కొంచెం పరిచై" అన్నాడు నీలకంఠం.

"ఇవాళ ఆపని నాకు చెప్పేరేటి బాబు" అంది సత్తి నవ్వుకొంటూ.

"ఇవాళ అమ్మగారు లేరు కాదు అందు చేత అమ్మగారు చేసే పనులన్నీ నివ్వే సర్దుకు పోవాలి"

సత్తెమ్మపక్క పరుస్తోంది.

"ఏమే సత్తీ! మీవాడు ఊళ్ళో కనపడడు" అంటూ అడిగాడు నీలకంఠం.

"పోనీయండి బాబూ ఆ యెదవ సచ్చి నోడూను యిప్పుడెందుకు" అంది సత్తి పెళుసుగాను.

నీలకంఠం ఇంక ఏంటి మాటాడాలో పాలుపోలేదు. ఇటువంటి చిల్లరవిషయాల్లో అనలే అనుభవంలేనివాడు. అందులోనికి గాబరా మనిషి.

వెంటనే వెళ్లి సత్తెమ్మచేయి పట్టుకొన్నాడు.

సత్తి అయ్యాగారి ముఖంలోనికి నవ్వు కొంటూ చూసి చక్కగా పఱచిన పక్కమీద ఒక్కసారిగా ఒరిగిపోయింది. మధుర గులాబీనిచూసిన మధుపం ఐపోయాడు నీలకంఠం.

ఇలా రోజులు గడిచిపోతున్నాయి. రోజూ ఒక్కపూట వచ్చే సత్తి నీలకంఠంగారింటికిపుడు మూడు పూటలా రావటం ప్రారంభించింది. ఈ విషయం వూరంతా ప్రాకిపోయింది. ఏనోట విన్నా సత్తెమ్మమాటే! సత్తెమ్మంటే సాలూరుతాలూకా కంతటికీ పేరు మోసింది. సత్తెమ్మని తెలియనివారు ఆవూర్లో ఒక రుండరు! మజాకాన యేంటి! అటువంటి సత్తెమ్మ ఇంత అఘాయిత్యానికి పాలుపడిందంటే తెలియకండావుంటుందా. ఉండుండి సుందరమ్మ ఊరినుండి ఊడిపడిందొకనాడు.

"మీనాన్న కెలా వుంది?" అని అడిగాడు నీలకంఠం.

"మానాన్న కేమండి నిక్షేపంలా వున్నాడు. అసలా టెలిగ్రాం వాళ్ళు యివ్వలేదంట. ఈ పని యెవరో మనమీద కిట్టనివారు చేసుంటారు" అంది సుందరమ్మ.

నీలకంఠం మౌనముద్రవహించి ఒండి వాడికి బాడుగయిచ్చి పంపేశాడు.

రెండురోజులు గడిచిపోయాయి. సత్తెమ్మ సంగతి సుందరమ్మ కర్ణరంధ్రాల్లో ప్రవేశించింది. టెలిగ్రాం ఎవరి పన్నాగంవలన వచ్చిందో, పచ్చినాడు అయ్యాగారి ఆనందానికి కారణమేంటో ఆమెకు తెలిసిపోయింది. వెంటనే యింటిలో సుందరమ్మ సమ్మె చేయనారంభించింది. సుందరమ్మ కనీస కోరికలు సత్తెమ్మను పనినుండి తొలగించటం, ఆ స్థానే మరో కొత్తమనిషిని ప్రవేశపెట్టటం. ఈ కోరికలు నీలకంఠంచే అంగీకరింపబడలేదు. సుందరమ్మ మూడవరోజునుండి సత్యాగ్రహం ప్రారంభించింది. సత్యాగ్రహం ప్రారంభించిన రెండు రోజులకు సత్తెమ్మ నీలకంఠంగారి పనికి రాజీనామా యిచ్చింది. ఆ సత్యాగ్రహలకు బ్రిటిష్‌వాళ్లే బెదిరిపోయారు సత్తెమ్మ నగా యెంత! బీరకాయపీచు.

పోయినపని పోయింది కాని సత్తెమ్మకు సంవత్సరానికి మూడు మాసాల తక్కువలో ఒక పాప చంకకొచ్చింది. ముచ్చాయి మూడు రూపులూ ఆ త్రిపురసంహారుడే.

(ఇది కేవలం కల్పితం)

★

# * పులి అరుపు *

*

రచన: ఎ. వి. శేషాచారి

★

పూర్వము అక్బరు పాదుషా రాజ్యపాలనము చేసేకాలములో తాన్సేను అనే ఒక కుఱ్ఱవాడుండేవాడు. అతడు ఏకసంతగ్రాహి. శ్రావ్యమైన కంఠముతో చిన్న వయసులోనే మనోహరముగా పాటలుపాడి ప్రేక్షకులను ఆనందపరిచేవాడు. తాన్సేన్‌తండ్రి 'లాలూ'కి రోడ్డు ప్రక్కనే ఒక మామిడితోట వుండేది. మామిడి పళ్లకాలములో రోడ్డుమీంచి పోయే ప్రతి బాటసారి మామిడిపళ్ళు కోసుకుని తీసుకుపోయేవాడు. లాలూ ఏవిధంగాను వారి దురాగతాన్ని అరికట్టలేకపోయేవాడు. ఒక్కపండుకూడా ఈతనికి దక్కేదికాదు. ఎలాగైన తన పంటని నిలుపమని తాన్సేను అతడు నియోగించేడు. వాళ్ళని మనము బెదరించి దెబ్బలాడలేము. గాన ఏదేనా ఉపాయముతో వాళ్ళని ఈ తోట దరిదాపులకు రాకుండా చెయ్యాలి అని తాన్సేను నిశ్చయించుకున్నాడు. ఒకనాడు ఒక పులి వారితోటప్రక్కనుంచే అరుచుకుంటూపోయింది. తాన్సేను ఈ అరుపును విన్నాడు. బాటసారులను ఈ అరుపు అరచి బెదరగొడదామని నిశ్చయించుకొని ఏకసంతగ్రాహి గావున పులి అరుపును ఆకర్ణించుకున్నాడు. మరునాడే దానిని అమలులో పెట్టేడు. బాటసారి రాగానే దగ్గరలోనే దాక్కొని పులి అరుపు అరచేవాడు. 'లాలూ'గారితోటలో పులి వుందని అందరూ నమ్మేరు. పులి భయమువల్ల తోటదరిదాపులకే ఎవరూ వచ్చేవారు కాదు. అపూర్వగాయకుడు తాన్సేను ఉపాయముతో మామిడిపండు ఒక్కటిగూడపోకుండా రక్షించాడు.

★